

నాపేరు విజయ్, రైతు, దేవనకొండ. నేను 2008లో ఎమ్మెస్సీ, 2010లో బీఈడీ పూర్తి చేశా. నిరుద్యోగిని ఉద్యోగం రాకపోవడంతో సొంత ఊర్లోనే ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నా. భార్య, ముగ్గురు పిల్లలున్నారు. నాకున్న నాలుగు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నా. ఈ ఏడాది పత్తి సాగు చేశాను. గత రెండు సంవత్సరాల నుంచి వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పులు పాలయ్యాను. పెట్టుబడుల కోసం గతంలో వైసీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.13,500 ఇచ్చేది. ఆ మొత్తం పెట్టుబడికి సాయంగా ఉండేది. టీడీపీ ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం అందించలేదు. ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని మాటలు చెప్పినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.



నా పేరు పి.నజీర్‌బాషా. 2007లో ఎంఏ, 2008లో బీఈడీ పూర్తి చేశాను. ప్రస్తుతం దేవనకొండలోని ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నా. అయితే చాలీచాలని జీతంతో బతకలేక తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన రెండు ఎకరాల్లో వ్యవసాయం కూడా చేసుకుంటున్నా. ప్రస్తుతం రెండు ఎకరాల్లో పత్తి పంట వేశాను. పంట పెట్టుబడికి ఎకరాకు రూ.40వేల వరకు ఖర్చవుతుంది. పంటలు సరిగా పండక బయట వ్యక్తుల దగ్గర అప్పు చేశా. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద ఏటా రూ.13,500 ఇచ్చేది. ఆ డబ్బులు పంట సాగుకు ఎంతో ఉపయోగపడేవి. అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారు. అయితే ఆ పథకం గురించి ఇప్పటి వరకు పట్టించుకోలేదు. ఇస్తారో లేదో కూడా తెలియదు. టీడీపీకి ఓటు వేసి మోసపోయాం.



నాపేరు రూతమ్మ, గజ్జహళ్లి గ్రామం. నా కొడుకు ఊర్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుకుంటున్నాడు. అర ఎకర పొలం తప్పా మాకు ఎలాంటి భూమి లేదు. కూలీ చేసుకుని బతుకుతున్నాం. ప్రభుత్వం పిల్లల చదువుకు బ్యాగులు, బుక్‌లు అన్నీ ఇచ్చినా వారికి కొంత ఖర్చవుతుంది కాదా. మాలాంటోళ్లం ఖర్చులు భరించలేం. ప్రభుత్వం ఒక పిల్లోడికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తానంది. ఆ డబ్బులు వస్తే.. మాకు కొంత ఆసరాగా ఉంటుందని భావించాం. అయితే ఇప్పటి వరకు ఆ మొత్తం వ్వలేదు. ఇన్ని రోజులైనా హామీలు అమలు చేయలేదు. అలాంటప్పుడు ఎందుకు ఆశ కల్పించాలి. ఇలా మాట తప్పితే ఏమైనా బాగుంటుందా. మొదటి నుంచి చంద్రబాబు మాటమీద నిలబడడని చాలా మంది చెప్పారు. అయినా మేం వినలేదు.



నాపేరు రామలింగమ్మ, గజ్జహళ్లి గ్రామం, హొళగుంద మండలం. ప్రభుత్వం 'తల్లికి వందనం' పేరిట ఒకరికి రూ.15 వేలు చొప్పన పిల్లల తల్లికి ఇస్తానంటున్న డబ్బు కోసం ఎదురు చూస్తున్నాం. నాకు ఒక కొడుకు, ఇద్దరు ఆడపిల్లలున్నారు. వారందరూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 4, 5, 9 తరగతులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం ఒకరికి రూ.15 వేలు ప్రకారంగా ఎంత మంది పిల్లలను చదివిస్తే అంత మందికి ఇస్తానంది. ఈ ప్రకారంగా మా ముగ్గురు పిల్లలకు కలిపి రూ.45 వేలు రావాలి. ఇప్పటి వరకు పథకం గురించి ప్రకటన చేయకపోవడంతో ఇస్తారో లేదోనని అనుమానంగా ఉంది. కనీసం పథకంపై విధివిధానాలు వెల్లడిస్తే నమ్మకం కలుగుతుంది. ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతో మా పిల్లల అవసరాలతో పాటు మాకు కొద్ది మేర ఆదుకుంటుంది.



నాపేరు లక్ష్మణస్వామి. ముక్కెళ్ల గ్రామం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వ్యవసాయమన్నా, రైతులన్నా ఎప్పుడూ చిన్న చూపే. 2014లో కూడా రుణమాఫీ చేస్తామని చెప్పి గెలిచాక సవాలక్ష షరతులు విధించి అరకొరగా మాఫీ చేసి రైతులను మోసం చేశారు. మళ్లీ పెట్టుబడి సాయం కింద రూ.20వేలు, సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల్లో ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత వాటి గురించి పట్టించుకోవడం లేదు. పీఎం కిసాన్ డబ్బులు పడి మూడునెలలు గడిచింది. ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాక ముందే సాయం అందేది. ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20వేలు రైతుల ఖాతాలకు జమ చేసి మాట నిలబెట్టుకోవాలి.

సూపర్ సిక్స్.. మోసం ఫిక్స్

- అమలుకు నోచుకోని సూపర్ సిక్స్ హామీలు
- ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రజల్లో అపనమ్మకం
- పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకపోవడంతో అమలుపై అనుమానాలు
- మంత్రుల ప్రకటనలతో గందరగోళంలో తల్లులు, రైతులు
- నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం ఇప్పట్లో లేనట్లే
- అధికారంలోకి వచ్చి వంద రోజులైనా పథకాల అమలుపై స్పష్టత కరువు

ఎన్నికలకు ముందు.. పేదల ఆదాయాన్ని పెంచేందుకు సూపర్ సిక్స్ పేరుతో ఆరు పథకాలను అందజేసి వారి జీవితాలను మారుస్తాం.. అంటూ చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ తదితరులు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి వంద రోజులైనా పథకాల అమలుపై స్పష్టతనివ్వకపోవడంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడంలో చంద్రబాబుకు అలవాటేనని, మరోసారి నమ్మి మోసపోయామని ప్రజలు వాపోతున్నారు.

ఆలూరు/ఆలూరు రూరల్/తుగ్గలి : ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి నాయకులు సూపర్ సిక్స్ పేరుతో ఉమ్మడి మేనిఫెస్టోలో పేదలకు పెద్దపేట వేస్తున్నట్లు ప్రకటించారు. ఇంట్లో ఎంత మంది పల్లలు చదువుతుంటే అంతమందికి రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేస్తాం.. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు, నిరుద్యోగులకు ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు, 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ ప్రతి నెలా రూ.1500 ఖాతాల్లో జమ చే స్తామని వాగ్దానం చేశారు. ఈ విషయాన్ని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. దీంతో నిరుద్యోగులు,మహిళలు,రైతులు పథకాలు అందుతాయని ఆశతో ఓట్లేసి గెలిపిస్తే.. ప్రస్తుతం ఆ హామీల అమలుకు నామాలు పెట్టేందుకు యత్నిస్తున్నారు. పథకాల అమలుపై ప్రశ్నిస్తే స్పష్టతనివ్వక పోవడంతో ప్రజల్లో అనుమానాలు పెరిగిపోతున్నాయి. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా కనీసం ఒక్క పథకమైన ఇవ్వకపోవడంపై మరోసారి చంద్రబాబు మోసం చేశాడని మండిపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో..



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించింది. ప్రతి రైతుకు రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఐదేళ్లలో ఆలూరు నియోజకవర్గంలోని 62,217 వేల మంది రైతులకు రూ.379 కోట్లకు పైగా వారి ఖాతాల్లో జమ చేసింది. అమ్మఒడి ద్వారా 34,981 మంది విద్యార్థులకు ఐదేళ్లలో రూ.141 కోట్లకు పైగా తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ఇవే కాక నవరత్నాల పేరుతో ఇచ్చిన హామీలన్ని నెరవేర్చింది. ఆలూరు నియోజకవర్గంలో మొత్తం 3 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు వివిధ పథకాల కింద రూ.1,471 కోట్లు అందజేసింది. అలాగే పత్తికొండ నియోజకవర్గంలో రైతు భరోసా కింది 56,367 మంది రైతులకు రూ.304.57 కోట్లు ఖాతాల్లో జమ చేసింది. అమ్మఒడి పథకం కింద 33,693 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.139.81 కోట్లు జమ చేసింది.

సూపర్ మోసం..



సూపర్ సిక్స్ పేరుతో ఆరు రకాల హామీల నెరవేరుస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊరూరా ప్రచారం చేశారు. అధికారం చేజిక్కాక ఆ ఊసే లేదు. దాటవేసే ధోరణిలో బాబు ప్రజలను మభ్య పెడతున్నారు. రాష్ట్ర పరిస్థితిని బట్టి సూపర్ సిక్స్ హామీలు వైపు చూడాలంటే భయమేస్తుందని కొత్త పల్లవి అందుకున్నారు. సాధారణంగా అధికారంలోకి వచ్చిన ఏ పార్టీ అయినా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతారు. కానీ చంద్రబాబు మాత్రం హామీల అమలు నుంచి తప్పించుకునేందుకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టి తమ నైజాన్ని చాటుకున్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే ఇచ్చిన హామీలకు ప్రత్యేకంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాల్సి వస్తుంది. పథకాలను అమలు చేసే ఉద్దేశం లేకనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తల్లికి వందనం పథకం అమలుపై అధ్యయనం చేస్తున్నామని, మేధావులతో చర్చిస్తున్నామని, ఇంకా ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులతో పలుమార్లు చర్చించి అమలుపై సాధ్యాసాధ్యాలు తేలుస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ శాసనమండలిలో ప్రకటించడం చూస్తే.. పథకాల అమలులో వీరి చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.



వేరుశనగ విత్తనం వేస్తున్న రైతు

ఆలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో చేకూరిన లబ్ధి..

పథకం	లబ్ధిదారుల సంఖ్య	ఖాతాల్లో జమచేసిన నగదు
అమ్మ ఒడి	34,981	రూ.141.41 కోట్లు
రైతు భరోసా	62,217	రూ.379.41 కోట్లు



పత్తికొండ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో చేకూరిన లబ్ధి..

పథకం	లబ్ధిదారుల సంఖ్య	ఖాతాల్లో జమ చేసిన నగదు
అమ్మ ఒడి	33,693	రూ.139.81 కోట్లు
రైతు భరోసా	56,367	రూ. 304.57 కోట్లు

ఆలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో చేకూరిన లబ్ధి..

పథకం	లబ్ధిదారుల సంఖ్య	ఖాతాల్లో జమ చేసిన నగదు
అమ్మ ఒడి	34,981	రూ.141.41 కోట్లు
రైతు భరోసా	62,217	రూ.379.41 కోట్లు

ఉద్యోగాలు కల్పించాలి



నేను బీఎస్సీ కంప్యూటర్స్ చదివాను. జాబ్ కోసం ప్రయత్నిస్తున్నా. ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టోను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. ఏటా జాబ్ క్యాలెండర్ ఇచ్చి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇవ్వాలి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే సమయంలో నిరుద్యోగ భృతి ఎంతో ఆసరాగా నిలుస్తుంది. మా తల్లిదండ్రులపై భారం తగ్గుతుంది.

– రాణి, నిరుద్యోగి, పగిడిరాయి



పత్తికొండ నియోజకవర్గంలో సూపర్ సిక్స్ కింద అర్హులకు అందాల్సిన నగదు..

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందాల్సి నగదు
తల్లికి వందనం	48,087	రూ.72.13 కోట్లు
రైతులకు ఏటా రూ.20,000	56,367	రూ. 112.73 కోట్లు
మహిళలకు ప్రతి నెలా రూ.1500	88,182	రూ. 13.23 కోట్లు
నిరుద్యోగ భృతి	58,751	రూ.17.63 కోట్లు

ఆలూరు నియోజకవర్గంలో సూపర్ సిక్స్ కింద అర్హులకు అందాల్సిన నగదు..

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందాల్సిన నగదు
తల్లికి వందనం	61,700	రూ.92.55 కోట్లు
రైతులకు ఏటా రూ.20,000	62,217	రూ.124.34 కోట్లు
మహిళలకు ప్రతి నెలా రూ.1500	93,959	రూ.14.9 కోట్లు
నిరుద్యోగ భృతి	74,572	రూ.22.37 కోట్లు

డబ్బులు ఎప్పుడు వస్తాయో



మాకు ఐదెకరాల పొలం ఉంది. పంటలు అంతంత మాత్రమే. కుమారులిద్దరినీ కష్టపడి చదివిస్తున్నాం. కర్నూలులోని ఓ ప్రవేటు కాలేజీలో ఇద్దరూ ఇంటర్ సెకండియర్ చదువుతున్నారు. ఒక్కొక్కరికి రూ.లక్షపైగా ఖర్చు వస్తోంది. ఎన్నికల ముందు తల్లికి వందనం పథకం కింద ఎంత మంది బడికి పోతే అంత మందికి రూ.15వేలు చొప్పున ఇస్తామని టీడీపీ వాళ్లు ప్రచారం చేశారు. ఇప్పుడు బడులు ప్రారంభమై నాలుగు నెలలవుతున్నా ఇంత వరకు డబ్బులు ఇవ్వలేదు. గత ప్రభుత్వం అమ్మ ఒడి కింద నా ఖాతాలో జమజేసేంది. డబ్బులు ఇవ్వకపోతే పిల్లల చదువులపై ప్రభావం పడుతుంది.

– ఇమాంబీ, గృహిణి, చెన్నంపల్లి

అధికారం కోసమే హామీ



నేను ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివాను. ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్ ఇంటికో ఉద్యోగం ఇస్తాం. 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. ఆ హామీ అమలుపై ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూస్తున్నాం. వీరి వ్యవహారశైలి చూస్తుంటే కేవలం అధికారం కోసమే హామీ ఇచ్చారని అర్థమవుతోంది. ఉద్యోగం వచ్చే వరకు అర్హులైన నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు చెల్లిస్తామన్నారు. చివరకు భృతి ఇస్తారనుకుంటే అదికూడా లేకపోయా.

– రంగస్వామి, కారుమంచి

జగన్ మాట ఇచ్చి.. అమలు చేశారు



ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జగనన్న ఆదర్శం. గత ఐదేళ్లలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి చూపించారు. ఎన్డీఏ నేతలు కేవలం ఓట్ల కోసం అలవిగాని హామీలిచ్చారు. ఇప్పుడు అమలు చేయలేక చేతులెత్తేస్తున్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులైంది. ఒక్క పథకమైనా అందించారా.. వీరి చర్యలు చూసి ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చివరకు రైతుల కష్టాలను కూడా పట్టించుకోవడం లేదు. పంటల సాగుకు సాయమందక చాలా మంది అప్పులు చేస్తున్నారు. ఇప్పటికి కూడా మంత్రులు హామీలు ఇస్తున్నారే కానీ.. స్పష్టంగా ప్రకటించలేకపోతున్నారు. – **మధుసూధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోశాధికారి**

హామీని నిలబెట్టుకోవాలి



ఎన్నికల ముందు 18ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని టీడీపా వాళ్లు హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలకంటూ టీడీపీ నాయకులు ఇంటింటికీ వచ్చి కరపత్రాలు కూడా ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీల గురించే మాట్లాడటం లేదు. రెక్కల కష్టంపై ఆధారపడి జీవిస్తున్న మాలాంటి కుటుంబాలకు పథకాలతో ఎంతో భరోసా ఉంటుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి.

– బోయ రామేశ్వరమ్మ, రామకృష్ణాపురం

మాట తప్పరాదు



ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటన లేకపోవడంతో చాలా మంది నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాము అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి అందజేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో యువత ఆ పార్టీకి మద్దతుగా నిలిచారు. అయితే అధికారంలోకి వచ్చి వందరోజులైనా ఉద్యోగాల క్యాలెండర్‌పై ఎలాంటి ప్రకటన లేకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. 2014లో కూడా భృతి ఇస్తామని నిండా ముంచారు. ఇప్పుడైనా చిత్తశుద్ధితో హామీని నిలబెట్టుకోవాలి. – **వాల్మీకి పెద్దయ్య, నిరుద్యోగి, నేషనల్ నవకాంత్రి పార్టీ పత్తికొండ ఇన్‌చార్జి, కోయిలకొండ**

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



నాపేరు మహమ్మద్. మద్దికెర మండలం పెరవలి గ్రామం. డిగ్రీ పూర్తి చేసి ఉన్నత చదువులకు వెళ్లాలని ప్రయత్నాలు చేయడమే గాకుండా పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నాను. ఎన్నికల్లో మాకు ఓటు వేస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని టీడీపీ, జనసేన నాయకులు హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు వాటికి సంబంధించి ప్రకటన చేయలేదు. మాలాంటి నిరుద్యోగులకు వెంటనే భృతి లేదంటే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. భృతి అందజేస్తే పరీక్షలకు సిద్ధం కావడానికి, కోచింగ్‌కు వెళ్లేందుకు కుటుంబంపై కొంత భారం తగ్గుతుంది.

– మహమ్మద్, పెరవలి, మద్దికెర, మండలం.


ఐటీ విద్యపై అవగాహన పెంచుకోవాలి

ఆలూరు: విద్యార్థులు శాస్త్ర సాంకేతిక విద్యపై అవగాహన పెంచుకోవాలని ఆలూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్. రాఘవరావు సూచించారు. టెక్నాలజీపై అధ్యయనం కోసం ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా బుధవారం ఆదోని భీమా ఇంజినీరింగ్ కళాశాలను విద్యార్థులతో కలిసి సందర్శించారు.

స్వచ్ఛతకు సహకరించండి

పత్తికొండ(తుగ్గలి) : ప్రజలందరి సహకారంతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ రోడ్డులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, సర్పంచ్ కొమ్ము దీపికతో కలిసి ఆయన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

ఎల్లార్తి దర్గాల హుండీ సొమ్ము లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల హుండీ కానుకలను లెక్కించగా రూ. 8,87,500 నగదు, 20 వెండి గుర్రాలు లభించాయని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్(డీఎండబ్ల్యూఓ) సబియా పర్వీన్ బుధవారం తెలిపారు. నాలుగు నెలలకు సంబంధించి రెండు దర్గాల హుండీల్లోని కానుకలను లెక్కించగా ఈ ఆదాయం వచ్చిందన్నారు. షేక్షావలి దర్గాలో చేపట్టిన హుండీ కానుకల లెక్కింపులో సబియా పర్వీన్, ఆదోని డివిజన్ వక్ఫ్‌బోర్డు ఆడిటర్ అండ్ ఇన్‌స్పెక్టర్ సుహేల్, ఈఓ ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ నెల 29 నుంచి ఉరుసు వేడుకలకు గాను ఈ లెక్కింపు చేపట్టారు. కాగా ఇటీవల కురిసిన వర్షానికి దాదాపు రూ.2.50 లక్షల వరకు నోట్లు తడిసి పనికిరాకుండా పోయాయని ఇన్‌స్పెక్టర్ సుహేల్, ఈఓ ఇమ్రాన్ తెలిపారు. పాత హుండీల స్థానంలో కొత్త హుండీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఈ– క్రాప్ నమోదు గడువు పెంపు

చిప్పగిరి: ఈ – క్రాప్ బుకింగ్ గడువును ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని ఏఓ విజయలక్ష్మీ బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులందరూ పంట నమోదు చేయించుకొని, ఈ-కేవైసీ కూడా చేయించుకోవాలని సూచించారు.


గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

దేవనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల శర్మ బుధవారం తెలిపారు. ఎకనామిక్స్ సబ్జెక్టు బోధించడానికి అర్హులైన అభ్యర్థులు ఈనెల 21వ తేదీ లోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, 23న ఇంటర్వ్యూ ఉంటుందని చెప్పారు.

పరిహారం చెక్కుల పంపిణీ

వెల్దుర్తి: గతేడాది డిసెంబర్‌లో ఆత్మహత్యకు పాల్పడిన ఇద్దరు రైతుల కుటుంబాలకు బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. పుల్లగుమ్మి గ్రామంలో వడ్డె సోంపురం వెంకటేశ్వర్లు, చాకలి మధుశేఖర్ ఆత్మహత్య కు పాల్పడగా వారి కుటుంబ సభ్యులు వడ్డె సోంపురం వెంకటేశ్వరమ్మ, చాకలి లక్ష్మీదేవికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.7లక్షల చొప్పున పరిహారం చెక్కులను ఏఓ అక్బర్‌బాషా ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రంలో అందజేశారు. సర్పంచ్ వెంకటేశ్వరమ్మ,టీడీపీ మండల అధ్యక్షుడు బలరాం గౌడ్ పాల్గొన్నారు.

స్పెయిన్ దేశస్తుల సందడి



స్పెయిన్ దేశస్తులను సన్మానించిన దృశ్యం

చిప్పగిరి: మండల కేంద్రంలో స్పెయిన్ దేశస్తులు బుధవారం సందడి చేశారు.ఆర్‌డీటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిర్మించిన ఇళ్ల ప్రారంభోత్సవం నిమిత్తం గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వారికి ఘన స్వాగతం పలికారు. స్పెయిన్ నుంచి వచ్చిన 20 మందిని సన్మానించారు. అనంతరం పేదల కోసం నిర్మించిన 38 ఇళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, రీజినల్ డైరెక్టర్ సరస్వతి, ఏటిఎల్ హనుమంతప్ప, సర్పంచ్ గోవిందరాజులు పాల్గొన్నారు.

జోకుమారుడి నిమజ్జనం

మద్దికెర : మండంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో బుధవారం మహాలయ పౌర్ణమి సందర్భంగా జోకుమారుడి నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వేడుకలు జరుపుకున్నారు. వినాయక నిమజ్జనం రోజున జన్మించిన జోకుమారుడు గ్రామంలో ఇంటింటికీ తిరిగి బుధవారం ఒట్టి నేలలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఓ కథ ప్రచారంలో ఉంది. వినాయకుడిని బావుల్లో నిమజ్జనం చేస్తే భూలోకంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని దేవతలకు చెబుతాడు. కానీ జోకుమారుడు మాత్రం ప్రజలు కరవు కాటకాలతో అల్లాడుతున్నారని దేవలోకంలో దేవతలకు చెబుతాడట.. అందువల్ల జోకుమారుడు నిమజ్జనం అయిన వెంటనే వర్షాలు బాగా కురుస్తాయని నమ్మకం.

చెరువులను నింపేదెన్నడు?

కృష్ణగిరి: హంద్రీనీవా నుంచి జిల్లాలోని 106 చెరువులను నింపాలన్న ప్రజల డిమాండ్‌ను పాలకులు పెడచెవిన పెడుతున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు చెరువులను ఎప్పుడు నింపుతారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఆయన సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌తో కలిసి మండలంలోని ఆలంకొండ సమీపంలోని పంప్‌హౌస్‌ను పరిశీలించారు. రామకృష్ణ, నారాయణ, వీరశేఖర్, నరసింహ, ఎల్లగౌడ్, రంగారెడ్డి ఉన్నారు.

వాల్మీకుల సమస్యలను పరిష్కరించాలి

ఆలూరు: వాల్మీకి కులస్తులలో ఉన్న ప్రాంతీయ వ్యత్యాసాలను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు తొలగించాలని వాల్మీకి ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలూరు సీఐ కె.శ్రీనివాసనాయక్, ఎస్‌ఐ సి.వెంకట నరసింహులుకు వినతిపత్రాలు అందజేశారు.
హాలహర్వి: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ వాల్మీకి బోయ సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్, ఆర్‌ఎంపీ నరసప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గూళ్యం గ్రామంలో బైకు ర్యాలీ చేపట్టారు.

వంటలు రుచికంగా ఉండాలి

ఆలూరు: మధ్యాహ్న భోజనంలో భాగంగా విద్యార్థులకు మెనూ ప్రకారం, రుచికరంగా వండి వడ్డించాలని ఎంపీడీఓ అల్లబకాష్ ఏజెన్సీల నిర్వహకులకు సూచించారు. బుధవారం హత్తిబెళగల్ రోడ్డు సమీపంలోనున్న గిరిజన గురుకుల బాలికల వసతి గృహాన్ని ఎంఈఓ– 2 చిరంజీవిరెడ్డితో కలిసి తనిఖీ చేశారు.

సచివాలయ ఉద్యోగులకు మెమోలు

హొళగుంద: మండలంలో ఆయా గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఏడుగురు సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ సుహాసినమ్మ బుధవారం మెమోలు జారీ చేశారు. ఇటీవల హొళగుందలో జరిగిన నీతి ఆయోగ్ కార్యక్రమ విధుల్లో పాల్గొనకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యం తదితర కారణాలతో మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఉన్నతాధికారులు, ప్రభుత్వం అప్పగించిన పనులను పెండింగ్ పెట్టకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించడం, ప్రజల నుంచి ఫిర్యాదు వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

పరామర్శ

చిప్పగిరి: మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మిలటరీ లింగన్న పక్షవాతానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విరుపాక్షి బుధవారం గ్రామానికి వెళ్లి ఆయనను పరామర్శించి. ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సేనాపతి,ఓబులేసు,మల్లికార్జున ఉన్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

హొళగుంద: వివిధ కేసుల్లో పట్టుబడి నిల్వ ఉన్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను బుధవారం పత్తికొండ పట్టణ శివారులో పత్తికొండ డీఎస్పీ బోయగడ్డ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు హొళగుంద ఎస్‌ఐ బాల నరసింహులు తెలిపారు. మొత్తం 15 కేసులకు సంబంధించి 7,305 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, మరో కేసులోని 5 లీటర్ల నాటుసారాతో కలిపి మొత్తం రూ. 3 లక్షల విలువ జేసే మద్యం ధ్వంసం చేసినట్లు చెప్పారు.


హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: పుట్లూరు గ్రామంలో మారెమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆరు పళ్ల వృషభాలకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రారంభించిన పోటీల విజేతగా వనపర్తి జిల్లా చిన్నబావి మండలం పెద్దదగడ గ్రామ పోగుల యశ్వంత్ కుమార్ వృషభాలు రూ.25వేలు గెలుచుకున్నాయి. తర్వాతి రెండు మూడు స్థానాలలో ఒకే దూరం బండను లాగిన డోన్ మండలం కొత్తకోట డాక్టర్ గురునాథ్ వృషభాలు, వెల్దుర్తి మండలం కలుగొట్ల రమేష్ నాయుడు ఎద్దులు రూ.35 వేల నగదును సరాసరిగా పంచుకున్నాయి. 4 స్థానంలో వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఆరేపల్లి గ్రామ తిరుపతయ్య వృషభాలు నిలిచి రూ.12 వేలు గెలుచుకోగా, 5వ స్థానంలో సంయుక్తంగా అనంతపురం రాప్తాడు కమ్మవారి పల్లె బెల్లం లక్ష్మన్న వృషభం, కర్నూలు పెద్దకడుబూరు మండలం కల్లకుంట్ల గ్రామ ఆంజనేయులు వృషభం నిలిచి రూ.10వేలు సొంతం చేసుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 19వతేదీన న్యూ కేటగిరీ విభాగంలో, 20న సీనియర్స్ విభాగంలో ఎద్దుల బండలాగుడు పోటీలుంటాయని నిర్వాహకులు తెలిపారు.

పథకాలు లబ్ధిదారులకే అందాలి



బింగిదొడ్డిలో సర్ఫేస్ ఫాం పాండ్ వద్ద రైతుతో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

వెల్దుర్తి: ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్దిదారులకే అందేలా చూడాలని, ఏ చిన్న పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పరిధిలో వెల్దుర్తిలో నిర్మిస్తున్న వ్యక్తిగత గృహాలు, బింగిదొడ్డి గ్రామంలో చేపట్టిన పండ్ల మొక్కల పెంపకం, సర్ఫేస్ ఫాంపాండ్‌లను పరిశీలించారు. రైతులు, లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈసీ మధుకృష్ణ, వెల్దుర్తి, బింగిదొడ్డి టీఏలు నాగేశ్వరరెడ్డి, పద్మావతి, ఎఫ్ఏ శ్రీదేవి ఉన్నారు.

హొళగుందకు చేరుకున్న చెత్త బుట్టలు



లారీలో హొళగుందకు వచ్చిన డస్ట్‌బిన్‌లు

హొళగుంద: గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసిన డస్ట్‌బిన్‌లు బుధవారం మండల కేంద్రం చేరుకున్నాయి. 17 గ్రామ పంచాయతీలకు దాదాపు 12,630 కుటుంబాలకు గాను మొదటి విడత కింద 22,146 చెత్త బుట్టలు రాగా మిగిలినవి త్వరలో రానున్నట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రం హొళగుందలో 3,648 కుటుంబాలకు గాను 7,296 చెత్త బుట్టలు పంపిణీ చేయాల్సి ఉంది. బుట్టలను స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని గదిలో భద్రపరిచారు. కాగా గతంలో వచ్చిన డస్ట్‌బిన్‌లు గ్రామాల్లో సక్రమంగా పంపిణీ జరగక వేలాది బుట్టలు జనాలకు అందలేదనే విమర్శలున్నాయి.